ఓ౩మ్

అమృత బిందువులు

సంపాదకులు : బ్ర. వేదవ్రతమీమాంసక

ఆచార్యులు ; ఆర్షగురుకులము, వడ్లూరు, కామారెడ్డి

అనువాదము : లోకలక్ష్మీనారాయణ

ప్రకాశకులు : ధనాలకోటి వెంకటనర్సయ్య

ఇందూరు

ప్రథమముద్రణ

సిద్ధార్థిమార్గశిర శు. ౩

వెల : ౩౦ పైసలు

ఓ౩మ్

ఆర్షగురుకులము, వడ్లూరు, కామారెడ్డి, ఇందూరు.

మహర్షి దయానందులు నిర్దేశించిన ప్రాచీనగురుకుల ప్రణాళిక ననుసరించి వేదాది సత్య శాస్త్రముల అధ్యాపనము, యోగాభ్యాసము ద్వారా సర్వాంగీణ వికసిత బ్రహ్మచారులను, విద్వాంసులను నిర్మించుటకై వి. శ. ౨౦౩౫ కాళయుక్తి ఆషాఢ శు॥ ఏకాదశినాడు దీని స్థాపన జరిగినది. ఇందు ౧౫ సంవత్సరములకు మించి వయస్సుగల్గి ఆజన్మబ్రహ్మచారులుగానుండ గోరు పదిమంది యోగ్యులైన విద్యార్థులకు మాత్రమే ప్రవేశ ముండును. నేడు ప్రచారమందున్న పాఠ్యక్రమముల క్రింద స్థానము లేదు. విద్యాభ్యాసము పూర్తియగు వరకు నగరమునకు పోవుటకు, పత్ర వ్యవహారము జరుపుటకు వీలుండదు. అధ్యయనముతోబాటు ఆసన, వ్యాయామ, ప్రాణాయామ, స్నాన, సంధ్య, యజ్ఞములు, నియమితముగా జరుగును. విద్యార్థులకు ఉప్పు, కారము, పులుపు, మసాలా మున్నగున వేవియు లేని సాత్విక భోజన ముండును. విద్యార్థుల వ్యయము గురుకులమే భరించుచున్నది.

ప్రస్తుతము నలుగురు విద్యార్థులు గలరు. దీనికి ఒక భవనముగల మూడెకరముల భూమి లభించియుండెను. అందు కొన్ని ఫలవృక్షములు నాటబడినవి. అభిమానులు దాతల సహాయముతో మరొక భవనమును నిర్మించినారు. వానప్రస్థాశ్రమమునకై దానముఇవ్వబడిన మూడెకరముల భూమిలో ఆశ్రమము నిర్మించవలసి యున్నది. గోవులున్నవి, గోశాల. స్నానాగారము, గోమయ యంత్రము మున్నగునవి నిర్మించవలసి యున్నవి. ఈ గురుకులము కామారెడ్డిలో సాప్తాహిక సత్సంగముల నిర్వహించుటేగాక ప్రతి దినము ఆసన, ప్రాణాయామ, సంధ్యాదుల శిక్షణ నొసగుచున్నది.

విభిన్న ప్రాంతముల జనుల సద్భావమును చూరగొన్న ఈ గురుకులము యొక్క భవిష్యత్తు ఉజ్జ్వలముగ కనబడుచున్నది. ధర్మరక్షణకై పూనుకొనిన యీ గురుకులమువల్ల అధికాధిక జనులు లాభముపొంది దీని ఉన్నతికై పాటుపడగలరని ఆశించబడుచున్నది.

ఆర్య సమాజము

కామారెడ్డి, ఇందూరు (నిజామాబాదు)

ఓ౩మ్

ము న్నుడి

ప్రియబంధువులారా।

ఒకటిన్నర శతాబ్దమునకు పూర్వపు విషయ మిది. మానవత్వము ఘోరమైన అజ్ఞానాంధకారమున బడి నిట్టూర్చుచుండెను. క్లేశ పీడిత మానవ హృదయము కరుణాక్రందన మొనరించు చుండెను. శాంతి లభించు నను ఆశ సన్నగిలి యుండెను. ఆస్థితి మిక్కిలి దయనీయము వికటము నై యుండెను. భారతదేశము పరాధీన శృంఖలములో చిక్కుబడి యుండెను. పరాధీనత భారతీయులకు స్వాభావికమై పోయియుండెను. ఆత్మాభిమానము, ఆత్మ విశ్వాసము వారినుండి తొలిగిపోయి యుండెను. అట్టి క్లిష్ట తరుణమందు భారతీయ ఆకాశపు పశ్చిమాంచలమున అనుపమ తేజోవంతమైన ఒకానొక సూర్యుడు దేదీప్యమానమైన స్వీయ ప్రభలతో నుదయించెను. అతడు తన మహనీయ ప్రభలచే ప్రపంచమును ప్రకాశ వంత మొనరించెను. అతని తపోమయ జీవనము నిష్కళంకబ్రహ్మ చర్యము, సమాధిజనితమైన సాటిలేని ఆనందము, విమలవిజ్ఞానము, పావన వేదము, పారదర్శియైన దివ్య దృష్టి మరియు తర్కసహాయమున నిర్మించుకొన్నట్టి జీవితము ఆకాశమువలె విశాలము, సముద్రము వలె గంభీరము, హిమాలయమువలె ఉత్తుంగమునై యుండెను. అతడు మానవ జాతియొక్క అసాధ్యప్రాయమైన రోగమునకు కారణము వెదకి కనుగొనెను. దానికి విజయవంతమైన చికిత్సనొనర్చెను. ఇట్టి మహోపకారమునకు మానవజాతి ఆచంద్రతారార్కము అతనికి ఋణపడి యుండగలదు. మహర్షి దయానంద సరస్వతియే ఆ దివ్యాత్మ. అతడు మానవ జాతికి చేసిన ఉపకారము అందుకై పడిన శ్రమ లెక్కింప నలవి కానిది.

నేడు వారు మన మధ్య లేరు కాని వారు చూపిన అమరమార్గము మన యెదుట నున్నది. వారి సిద్ధాంతములను ప్రపంచపు మారు మూలలకు వ్యాపింపజేయుటకై ఆర్యసమాజము కృషిజేయుచున్నది. మహర్షి నిగూర్చి రాజులు, మహారాజులు, యోగులు, సాధు సత్పురుషులు, సంఘ సంస్కర్తలు

దేశవిదేశ విద్వాంసులు, రాజకీయావేత్తలు. చరిత్రకారులు, తత్త్వవేత్తలు, దార్శనికులు, కవులు, విద్యావేత్తలు, క్రాంతికారులు మున్నగు వారు తమ అభిప్రాయములను వ్యక్తపఱచియున్నారు. వారిలో కొందరి కొన్ని ప్రముఖ అంశములను మీ ముందుంచుచున్నాము. వీటితో బాటు మహర్షి యొక్క సువర్ణ సిద్ధాంతములను కొన్నిటిని కూడా ఒసగుచున్నాము. చదువరులు ఋషి దయానందుని హృదయమును దర్శించి వారు చూపిన అమృత (మార్గ) పానమొనర్చి తమ జీవితములను అమర మొనర్చుకొని సర్వప్రాణిహిత మొనర్చుటకు దృఢసంకల్పు లగుదురని ఆశించు చున్నాము.

ఈ పుస్తకమును శ్రీ ధనాలకోటి వెంకటనర్సయ్య, వారి గృహిణి శ్రీమతి సురేఖ (విజయలక్ష్మి బ్రాస్ మర్చెంట్) ఇందూరు (నిజామాబాద్) వాస్తవ్యులు తమ ప్రథమ పుత్రికా నామకరణ సంస్కార సందర్భమున (సిద్ధార్థి మార్గశీర్ష శుద్ధ పంచమి) ప్రచురించి తమ ప్రియమైన ఆర్షగురు కులము (వడ్లూరు)నకు సమర్పించుచున్నారు. పరమేశ్వరుడు ఈ పరివార మునకు సర్వవిధ సుఖముల నొసగుగాక!

బ్ర. వేదవ్రత మీమాంసక
ఆచార్యులు
ఆర్షగురుకులము వడ్లూరు,
కామారెడ్డి, ఇందూరు (నిజామాబాద్)

సృష్టి సంవత్సరము ౧౯౭౨౯౪౯౦౭౯
సిద్ధార్థి కార్తీక బ ౧౧
వి. శ. ౨౦౩౬

నేను ఉత్తమ మానవుడ నగుదును గాక!

-అథ. ౬-౧౫-౨

కర్మఫలము కర్తకే లభించును. -అథ. ౧౨-౩-౪౮

ఓ౩మ్

అమృత బిందువులు

౧. మహర్షి దయానందులు ధర్మజాగృతి యొనరించిరి. వారి బ్రహ్మచర్యము నాకు స్పర్ధింపదగినది. వారు భారతదేశపు ఆధునిక ఋషులలోను, సంస్కర్తలలోను, శ్రేష్ఠ పురుషులలో నొకరు. నేనెంత అధికముగ నాలోచించిన నంతే అధికముగ మహర్షి చూపిన మార్గము యొక్క గంభీరత నాకు గోచరించును.

—మహాత్మా గాంధి.

౨. స్వామి దయానందుల జీవితమున సత్యాన్వేషణము కనిపించును. కావున వారు ఆర్యసామాజికులకే గాదు ప్రపంచ మంతటికిని పూజనీయులు. —మాతా కస్తూరిబాయి.

౩. స్వామి దయానందులు అనేక దేశముల ధార్మిక సాహిత్యములను పూర్ణముగా నెరిగిన విద్వాంసులు. ఈశ్వర కృత వేదములే వారు ప్రకటించిన ధార్మిక నియమములకు మూలము. వారికి వేదములు కంఠాగ్రములై యుండెను. వారి హృదయ మస్తిష్కములు వేదములకు నిలయములై యుండెను.

—ప్రొఫెసర్ మోక్షమూలరు.

౪. ఎవరి దృష్టి భారతదేశపు ఆత్మిక ఇతిహాసమునందు సత్యమును, ఐక్యతను దర్శించెనో ఆ మహాగురువు స్వామిదయా నందులకు నా సాదర ప్రణామములు. ఏ గురువు యొక్క ఉద్దేశము భారత దేశమును అవిద్య, ఆలస్యము (సోమరితనము) ప్రాచీన ఐతిహాసిక తత్త్వజ్ఞానహీనతనుండి విముక్త మొనర్చి సత్యము మరియు పవిత్రతల జ్ఞానమును కలిగించుటయైయుండెనో ఆ గురువునకు పదేపదే నమస్కారము. —రవీంద్రనాథఠాకూరు.

౫. స్వామి దయానందులు నాకు గురువులు. ప్రపంచమున వారి నొకరినే నేను గురువుగా భావించినాను. వారు మనకు దేశప్రేమ యొక్క మధుర ఫలమును రుచి చూపినారు.

—లాలా లాజపత్‌రాయ్

౬. స్వామి దయానందుడు తన సమస్తజీవితమును ఆర్యావర్త దేశ సేవకై సమర్పించెను, అతడు నిజముగా విద్యాసాగరుడు; సంస్కృత విద్య యొక్క సంచరించు విశ్వకోశము. అతడొక ఋషి. నా దుర్బల శబ్దములు ఋషివర్యుని గొప్పదనమును వర్ణించుటకు సమర్థములు గావు. నేను వారినొక శక్తిసుతునిగా-కర్మవీరుడైన యోద్ధగా-భావించి ఆదరింతును. వారి బ్రహ్మచర్యము, సత్యసంగ్రామము, ఉత్కట దేశభక్తి, తపస్సులకు ముగ్ధుడనై వారిని రాష్ట్రవీరునిగా భావించి వందన మొనర్చుచున్నాను.

—సాధు పురుషులు టీ. యల్. వాస్వానీ.

౭. నేను స్వామి దయానందులను ఒక ధార్మిక, సామాజిక సంస్కర్త, కర్మయోగి యని విశ్వసింతును.

—నేతాజీ సుభాష్చంద్రబోస్

౮. స్వామి దయానందులు భారత వర్షములోని ప్రస్తుత ధార్మిక శాంతికి జన్మదాతలు. వారి స్వరూపమును పుస్తకపండితులు గ్రహింపలేరు.

—సీ.ఎస్. రంగా అయ్యర్.

౯. మహర్షిదయానం లు భారతదేశమున జన్మించకున్నచో నేడు మనకు మహాత్మా గాంధి, మహాత్మా తిలక్, లాలా లాజపతరాయ్ వంటి దేశభక్తుల దర్శనము లభింపకుండెడిది.

—ఖదీజాబేగం, ఎం. ఏ.

౧౦. స్వామి దయానందులు మీ కారాగారమును కూల ద్రోయుటకు, మీ యాత్మలను బంధవిముక్తమొనర్చుటకు, మీ దేశమునకు పునర్జీవన మొసగుటకు అవతరించినారు.

-ఫ్రాన్సుదేశ ప్రసిద్ధ రచయిత "పాల్ రిచర్డ్"

౧౧. ఒక సనాతన ధర్మావలంబినైన నేను స్వామిదయానందులు భారతదేశపు ప్రప్రథమ సంస్కర్తయని భావించు చున్నాను.-రాజాబహద్దూర్ మహేశప్రతాప నారాయణసింహ, శివగఢ్ రాజా.

౧౨. భారతీయ భావములకు, ధర్మమునకు ఆదిస్రోతస్సులైన వేదములందు ఋషి దయానందులు ఉన్నతమైన ఆత్మిక సిద్ధాంతము లన్నిటికి బీజమును, కేంద్రమును దర్శించిరి.

-రెవరెండ్ టీ. డీ. సలే. ప్రిన్సిపాల్, సేంట్ జాన్స్ కాలెజ్, ఆగ్రా.

౧౩. స్వామి దయానందులు వివిధ ధర్మానుయాయులందరిచేతను గౌరవింపదగిన విద్వాంసులు, సత్పురుషులునై యుండిరి. భారతదేశమున నేడతనితో సమానమైన వ్యక్తి లభించుట అత్యంత కఠినము. -సర్ సయ్యద్ అహమద్ ఖాన్.

౧౪. ఋషి దయానందులు భారతీయాకాశమున అలౌకిక కాంతితో ప్రకాశించిన జాజ్వల్యమాన నక్షత్రము. వారు స్వరాజ్య ప్రప్రథమ సందేశవాహకులు మరియు మానవత్వోపాసకులు.

-లోకమాన్య బాలగంగాధర తిలక్.

౧౫. మహర్షి దయానందులు తపోమూర్తులు. వారు భారతదేశమునం దొక దివ్య జ్యోతిని వెలిగించిరి. వారు భారత దేశపు దివ్య స్వతంత్ర రూపమును జూడగోరిరి. వైదిక కాలమును పునః ప్రతిష్ఠించుటకు వారెంతయో కృషి చేసిరి.

-మహామనీషి మదనమోహన మాలవీయ.

౧౬. స్వామి దయానందులు పూర్వజన్మలో సంస్కరింప బడిన మహాత్ముడు. ఆర్యధర్మ తత్త్వముయొక్క యథార్థ స్వరూపమును ప్రపంచము నెదుట ప్రవేశపెట్టుటలో స్వామీజీ తమ కుశాగ్రబుద్ధిని ప్రకటించిరి. —మహాదేవ గోవింద రానడే.

౧౭. స్వామి దయానందులను నేను అందరికన్న గొప్ప సమాజ సంస్కర్తయని నమ్ముచున్నాను. —గోపాలకృష్ణ గోఖలే.

౧౮. కేవలము స్వామిదయానందులు చూపిన మార్గము ననుసరించియే నేటి పరిస్థితి నెదుర్కొనగల్గుదుము.

—డా. సర్వేపల్లి రాధాకృష్ణన్

౧౯. భారతదేశపు శక్తిరహిత కాయమునందు ఋషి దయానందులు తమ అజేయశక్తిని, దృఢత్వమును, సింహ పరాక్రమమును నింపిరి. —రోమాఁ రోలా

౨౦. మానవ జన్మోద్దేశపు కాంతికిరణమును గాంచిన మనుజులెందరో గలరు. కాని సమస్త ఉత్తమ గుణసంపన్నులైన వ్యక్తులు మిక్కిలి అరుదు. అట్టి వ్యక్తి కేవలము దయానందుడే.

—మిస్టర్ ఫాక్స్‌పీట్, జనరల్ సెక్రెటరీ, మారల్ ఎడుకేషన్ లీగ్, లండన్

౨౧. ఈ యుగమున దేవవాణి నుద్ధరించినవారు స్వామి దయానందులే. దీని వలననే నేడు భారతదేశమున క్రాంతి జరుగుచున్నది. —మహామహోపాధ్యాయ శివకుమార్ శాస్త్రిగారు.

౨౨. స్వామి దయానందు లోక మహాత్ములని నా భావము. వారి ధర్మము విశాలము. —రాజర్షి టాండన్.

౨౩. ఋషి దయానందులను నేను రాజనీతి గురువుగా భావింతును. —విఠల్‌భాయి పటేల్.

౨౪. భారతదేశపు సామాజిక చరిత్రయందు స్వామి దయానందులకు ప్రముఖ స్థానము గలదు.

-శ్రీప్రకాశ్, బార్ ఎట్ లా.

౨౫. స్వామి దయానందులపై సంకీర్ణతాదోషము నాపాదించుట భ్రమపూరితమైన పొరపాటు.

-నృసింహ చింతామణి కేల్కర్.

౨౬. ఆర్యసమాజము రాజద్రోహముచే దూషితమైనట్లుగ నేటివరకు నేనెన్నడును వినలేదు. -శ్రీమతి అనీబీసెంట్.

౨౭. దయానందులను కోల్పోయినందున భారతదేశమున కెంతయో హాని కలిగినది. -మిస్టర్ ఏ. ఓ. హ్యూమ్.

౨౮. స్వామి దయానందుల గుణములను వర్ణించుట, వారి భావములను, ఆలోచనలను వివరించి చెప్పుట సామాన్య మానవులకు శక్యము కాదు. వారి మస్తిష్కమున గల దివ్య భావములను శతాంశమైనను నేను వర్ణింప సమర్థుడను గాను.

-రాజాధిరాజ సర్ నాహర్‌సింహ వర్మ.

౨౯. సూర్యచంద్రులు భూమండలమున ప్రకాశించునంతవరకు ఋషి (దయానందుని) జీవితము మానవుల జీవితములకు మార్గదర్శకముగా నుండును. -రాజా తేజసింహ వర్మ.

౩౦. పరమ పితా పరమేశ్వరుడు ధర్మమును, జాతిని రక్షించుటకై తనకు పరమ భక్తుడును, ప్రియమైనపుత్రుడును, బాలబ్రహ్మచారియునైన స్వామి దయానందులను పంపి హిందూ జాతిని ధర్మచ్యుతి నుండి రక్షించెను. కావుననే నేడు హిందూ జాతి పేరు నిలిచియున్నది.

-ప్రిన్స్ నరేంద్ర శంషేర్ జంగ్ రానాబహాదుర్ ఆఫ్ నేపాల్.

౩౧. భారతదేశ చరిత్రయందు స్వామి దయానందుని పేరు గొప్ప సంస్కర్తల పవిత్రశ్రేణిలో సువర్ణాక్షరములతో వ్రాయబడును. —లాలా హరదయాల్‌జీ, ఎం. ఏ.

౩౨. పందొమ్మిదవ శతాబ్దమున స్వామి దయానందుల వారు భారతదేశమునకు చేసినట్టి అమూల్యమైన సేవల వలన హిందూ జాతితోబాటు మహమ్మదీయాది అన్యమతావలంబులకును ప్రత్యక్షముగనో అప్రత్యక్షముగనో అత్యంతలాభము చేకూరినది

—పీర్ ముహమ్మద్ మూనిస్.

౩౩. స్వామి దయానందులు తమ యోగశక్తిచే భారత దేశము యొక్క అవసరములను ఎన్నియో సంవత్సరములు ముందే గ్రహించిరి. —షాహపురాధీశులు, ఉమ్మేద్ సింహ.

౩౪. స్వామి దయానందులు సత్యోపాసకులు. వారు స్వదేశమును ప్రేమించుచుండిరి. ఐనను కేవలము భారత దేశ వాసుల కల్యాణమునే గాదు సమస్త మానవజాతి కల్యాణమును కోరుచుండిరి. —పండిత విధుశేఖర భట్టాచార్య, ప్రిన్స్‌పాల్.

౩౫. "ఓ ఋషివరా! మీరిపుడు ఈ లోకమున లేరు. కాని భారతదేశమే కాదు మొత్తము ప్రపంచము మీ యడుగు జాడలలో నడచునట్టి దినము త్వరలోనే రానున్నది.

—నారాయణగోస్వామి, వైద్య.

౩౬. ఋషి దయానందుని సాఫల్యము అసందిగ్ధమనుటను అతని విమర్శకులు గూడ నిరాకరింపజాలరు. మన సర్వాంగీణ వికాసమునకు ఋషి జీవితము ఆదర్శ ప్రాయ మయినది. ఆ విశాల జ్యోతిచే శతాబ్దాల తరబడి జనులు తమ తమ దీపములను వెలిగించుకొనుచునే యుండగలరు. —ఇంద్ర విద్యావాచస్పతి, ఉపకులపతి, గురుకుల విశ్వవిద్యాలయము, కాంగ్డీ

౩౭. ప్రపంచమునకు సన్మార్గమును చూపుట కేతెంచి పథభ్రష్టులకు మార్గము చూపి నిష్క్రమించునట్టి దీపస్తంభములలో స్వామి దయానందు లొకరు. –భాయీ పరమానంద.

౩౮. భారతీయ దేశభక్తులలో స్వామి (దయానందులకు)కి సమున్నత స్థానము గలదు. ఏలన వారొక గొప్ప త్యాగి, యోగి మరియు విద్వాంసులు.

–ఆనరేబుల్‌రాజా సర్ మోతీచంద్ బహాదుర్, సీ. ఐ. ఏ.

౩౯. "మీ జనన మరణములు దక్షిణ భారతమున జరిగి యుండెనేని మీరు మూర్తిపూజను ఖండించువారైనప్పటికి మీకు దేవతా పదవి లభించి మీ విగ్రహము మందిరమున స్థాపించబడి దానికి పూజలు జరిగెడివి. –శ్రీ విజయరాఘవాచారి.

౪౦. దయానంద మహర్షి ఉత్తమ వ్యక్తిత్వమును పవిత్ర చరిత్రను లోకమెల్ల నిస్సంశయముగ ప్రశంసించుచున్నది.

–రెవరెండ్ సీ. ఎఫ్. ఆండ్రూస్.

౪౧. భారతీయ సంస్కృతి నిర్జీవమై క్షీణదశలో నుండెను. అట్టి తరుణంలో పునర్జీవనోద్యమానికి పూనుకొని నిద్రపోవు చుండిన భారత అంతరాత్మను మేల్కొల్పిన మహనీయులలో పేర్కొనదగిన మహాశయుడు స్వామి దయానంద సరస్వతి. మత పునరుజ్జీవనానికి, సంఘ సంస్కరణకు కంకణం కట్టుకున్న దయానంద స్వామి నిర్భయంగా, నిర్లక్షంగా, తన సందేశాన్ని వెల్లడిస్తూ దేశమంతా శ్రమ అనక, విశ్రాంతి లేక పర్యటనం చేశాడు. అతని ఉద్భట వాద పాండిత్యం నిరుపమానం. అసమానమైన అతని తత్త్వశాస్త్రజ్ఞానం అతని శత్రువులు సహితం మెచ్చుకోవలసివచ్చేది. అతడు నవ్యమత పరివారం

కోసం ఆర్యసమాజాన్ని స్థాపించలేదు. హిందూమతాన్ని వేదానుసారంగా పునరుజ్జీవం చెయ్యవలెనని అతని ఆశయం. గాంధీ మహాత్ముడు, ఇతర దేశనాయకులు ఎన్నోదశాబ్దాల తరువాత ప్రారంభించిన స్వదేశోద్యమానికి బీజములు దయానందస్వామి ప్రసంగాల్లో కనబడుతవి. అనేక రంగాల్లో దయానందస్వామి జాతీయ జాగృతికి నిజంగా వేగుచుక్కవంటివాడు.

—డా. పీ. వీ. రాజమన్నారు, మద్రాసు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

౪౨. భారతదేశ నవయుగమున భారత సంతానమునకు ప్రత్యక్షమగు విశిష్ట వ్యక్తులందరిలో విలక్షణ ప్రతిభా సంపన్నుడైన ఒక మహాపురుషుడు గలడు. అతని కార్యములు అనుపమానములైనట్లే అతని వ్యక్తిత్వము అపూర్వమయినది. అతడే ఋషి దయానందుడు. ప్రకాశవంతమయిన పరమేశ్వర సృష్టిలో నతడొక మహా యోధుడు. మనుష్యులను, సంస్థలను సంస్కరించు శిల్పి. ప్రకృతిలో జీవులెదుర్కొను కష్టముల నధిగమించుటలో విజయుడైన వీరుడు. పరమాత్మ ప్రకాశమును తనలో ధరింపజేసికొన్న మహామానవుడు. అతని నేత్రములందు అతని ఊహలతేజము ప్రదర్శితమగుచుండెను. అతని బాహువులందు జీవితమున తన భావములను సాకారమొనర్చగల మహత్తర శక్తియుండెను......అటవికుల పుస్తకమని నిరసించబడిన వేదము సత్య ధర్మ గ్రంథమని నిరూపించిన ధీరుడు. సత్యమైన వేదభాష్యమును రచించిన వారిలో అగ్రగణ్యుడు.

—అరవిందఘోష్.

౪౩. మహర్షి దయానందుడు సద్గుణ తపోబల సంపన్నుడు. కొందరాతనిని ఋషి, రాజనీతిజ్ఞుడు, ధర్మమార్గదర్శకుడు

అందురు. నాదృష్టిలో అతడు బౌద్ధిక, సామాజిక, రాష్ట్రీయ — సమస్తదాస్యముల ముక్తిదాత. —శ్రీమతి సరోజినీనాయుడు.

౪౪. ఆధునిక యుగములో భారత దేశమున జన్మించిన వారిలో గొప్ప సంస్కృత విద్వాంసుడు, సాహిత్యవేత్త, వేదవేత్త ప్రబల న్యాయవేత్త యెవరని ప్రశ్నించిన మహర్షి దయానంద సరస్వతి యనియే చెప్పవలసి యుండును.

—సుప్రసిద్ధ అమెరికన్ తత్త్వవేత్త డాక్టర్ డీ.డీ. స్టాక్.

౪౫. దయానందుడు ప్రప్రథమముగ స్వాతంత్ర్య బీజమును నాటెను. భారత స్వాతంత్ర్య చరిత్రలో సర్వప్రథమమున వారి నామ ముల్లేఖింపబడును. —కైలాసనాథ కట్జూ.

౪౬. మహర్షి ఆధునిక భారత నిర్మాతలలో మహనీయుడు. వారు స్థాపించిన ఆర్యసమాజము వారి ఉద్దేశములను సఫలమొనర్చి మన ధార్మిక, సామాజిక, రాజనైతిక, ఆర్థిక ఉన్నతికి కారణ భూతమగు గాక యని భగవంతుని ప్రార్థించుచున్నాను.

—నేతాజీ సుభాష్చంద్రబోసు.

౪౭. మహర్షి దయానందులు స్వాతంత్ర్య సంగ్రామ ప్రప్రథమ యోధులు, హిందుజాతి రక్షకులు. వారు స్థాపించిన ఆర్యసమాజము దేశమునకు మహత్తరమైన సేవలు జేసినది. ఇంకను చేయుచున్నది. స్వాతంత్ర్య సంగ్రామములో ఆర్య సామాజికులదే పైచేయి. మహర్షి అమర గ్రంథమైన సత్యార్థ ప్రకాశము హిందువుల నరనరాలలో విప్లవ జ్వాలలను రగుల్కొల్పును. —వీర సావర్కార్.

౪౮. ఋషివరా! నీవు భౌతిక శరీరము చాలించి ౪౭ సంవత్సరము లైనప్పటికిని నీ దివ్యమూర్తి నా హృదయ ఫలకముపై యథాతథముగ అంకితమైయున్నది. నీ స్మరణ మాత్రముననే పతనము కానున్న నా ఆత్మ ఎన్నిమారులు రక్షింప బడినదో నా నిర్భలహృదయము తప్ప అన్యు లెవరు తెలిసికొన గలరు? పతితమయిన ఆత్మల నెన్నిటిని నీవు కాయాకల్ప మొన ర్చితివో, నీ యుపదేశములనుండి వెలువడిన అగ్ని ప్రపంచమున వ్యాపించియున్న పాపముల నెన్నిటిని దగ్ధమొనర్చినదో - నీవీ సమయమున ఏ యానంద స్వరూపుని యొడియందు విహరించు చుంటివో ఆ పరమేశ్వరుడుగాక మర్త్యులైన మానవు లెవరు పేర్కొనగలరు? కాని నీ సాహచర్యము నన్నెంతటి పతనావస్థ నుండి ఉద్ధరించి వాస్తవమయిన జీవితలాభమును పొందుటకు యోగ్యునిగా నొనర్చినదో మాత్రము నేను చెప్పగలను.

నీవు ఉపదేశ మాత్రముననే ప్రచారమొనర్చు తత్త్వ వేత్తవు గాదు, ఏయే సత్యములను ప్రపంచమున ప్రచార మొనర్ప దలచితివో వానిని క్రియాన్విత మొనర్చి నిరూపించు భారమును గూడ వహించిన మహానుభావుడవు. శ్రీకృష్ణభగవానుని వలె నీకును ముల్లోకములందు కర్తవ్య మేమియు మిగులకున్నను మానవజాతికి ఋజుమార్గమును చూపుటకు కర్మ నుపేక్షించలేదు.

-స్వామి శ్రద్ధానంద్.

౨

౧. అవిద్యా అస్మితా రాగద్వేష అభినివేశము (మరణ భయము)లను క్లేశములు శుభాశుభ కర్మలు వాటి విపాకము (ఫలము) కర్మాశయముతో సంబంధములేని సర్వవ్యాపకుడు భగవంతుడు.
-మహర్షి పతంజలి.

౨. బ్రహ్మ జీవుడుగాని జీవుడు బ్రహ్మగాని ఎన్నడును కాలేదు, ఇపుడు కావు, ఇకముందు కాజాలవు. (స. ప్ర.)

౩. ఈశ్వరుడు తన భక్తుల పాపములను క్షమించడు. ఎచ్చటికి బోయినను పాపఫల మనుభవింపక తప్పదు, తగ్గదు. చేసిన పాప మనుభవించ వలసియే యుండును.

౪. స్తుతిచే నీశ్వరునియందు ప్రీతియు అతని గుణకర్మ స్వభావములచే తన గుణకర్మ స్వభావముల సవరణయు ప్రార్థనచే నిరభిమానము, ఉత్సాహము, సహాయము కలుగుటయు ఉపాసనచే పరబ్రహ్మతో సంబంధమేర్పడి అతని సాక్షాత్కారము గలుగును

౫. పరమేశ్వరుని నామముల యర్థమును గ్రహించి పరమేశ్వరుని గుణకర్మ స్వభావముల ననుసరించి తన గుణకర్మ స్వభావములను సవరించుకొనుచుండుటయే పరమేశ్వరుని నామ స్మరణము.

౬. యోగాభ్యాస విజ్ఞానములు లేకున్న పరమాత్మ యగుపడడు.

౭. మనుష్యుల జ్ఞానము జడపదార్థములను పూజించుట వలన వృద్ధిచెందదు. ఉన్నది కూడ నశించును. మూర్తిపూజ

(పరమేశ్వరుని ధ్యానమునకు) మెట్టుకాదు. అది యొక అగాధ కందకము. దానిలో బడి (మనుష్యుడు) తునాతునకలై పోవును. పైకి రాజాలడు. అందులోనే పడి చచ్చును.

౮. పరమేశ్వరుని పూజ మాని అతనికి బదులు ఇతరులను పూజించువాడు, అతడు నివసించు సమగ్రిదేశము అత్యంత దుర్గతి పాలగును.

౯. వేదము సమస్త విద్యలకు నిలయము.

౧౦. వేదముల అధ్యయన-అధ్యాపనములు లోపించుటచే ప్రపంచమందు అవిద్యాంధకారము వ్యాపించి మానవుల బుద్ధి భ్రమకులోనై యెవరికి నచ్చినటుల వారు తమ తమ మతములను నెలకొల్పిరి.

౧౧. నేను అరబ్బీ మొదలగు నెన్నియో భాషలను ఆయా భాషలలో నున్న గ్రంథములను చదివితిని. ఐనను నా సందేహములు తీరక ఆనందము కలుగ లేదు. కాని సంస్కృతమును చదివి, వినిన పిదప నా సంశయము లన్నియు తొలగి ఆనందము కలిగినది.
-దారాశికోహ

౧౨. ధార్మికులు, విద్వాంసులు, ఆప్తులునైన వ్యక్తులను ఆర్యులనియు వీరికి విరుద్ధమైన ఆచరణ గలవారిని దస్యులు అనగా దోపిడిగాండ్రు, దుష్టులు, అధార్మికులు, అవిద్వాంసులు-అనియు వ్యవహరింతురు.

౧౩. ఆవులు మొదలగు పశువులను చంపునట్టి మద్యపానరతులు రాజ్యాధికారులైనప్పటి నుండి ఆర్యుల దుఃఖము అధికమగుచునే యున్నది.

౧౪. ఆర్యావర్త దేశము సమస్త విద్యలకు, శుభములకు నిలయము. ఓ పరమేశ్వరా! ప్రాచీన కాలమున ఆర్యావర్త దేశమున గల ఉన్నతిని మా దేశమునకు ప్రసాదింపుము.

—జై కాలియట్

౧౫. మానవ జన్మము సత్యాసత్యముల నిర్ణయమొనర్చుటకును ఒనరింప జేయుటకును లభించినది గాని వాదవివాదముల ద్వారా విరోధము చేయుటకును చేయించుటకును గాదు.

౧౬. మానవ జాతియొక్క ఉన్నతికి సత్యోపదేశము తప్పవేరే ఉపాయమేదియు లేదు. సత్యమును గ్రహించుటకును అసత్యమును త్యజించుటకును ఎల్లప్పుడు సంసిద్ధులై యుండవలెను

౧౭. ఎవరిది సత్య (మత)మో వారి కెవరివలనను భయము లేదు.

౧౮. అసత్యము పలుకువాడు సమూలముగ నశించును.

౧౯. సత్యము స్వర్గమునకు సోపానము. —చాణక్యనీతి

౨౦. దుఃఖము పేరు నరకము, సుఖము పేరు స్వర్గము.

౨౧. సత్యార్థప్రకాశము మానవుని దానవత్వము తొలగించి అతనిని మానవత్వమువైపు గొంపోవు అమర గ్రంథము. ఇది లక్షలాది జనుల ఆత్మలను ఉద్ధరించినది. ఇందలి ప్రతి శబ్దము స్వర్ణిమమే. ఇది మానవుని సమస్యలన్నిటికి సరళము, స్పష్టము, వైజ్ఞానికమునైన సమాధానము చూపునట్టి ఏకైక అనుపమ గ్రంథరాజము. —బ్ర. వేదవ్రత మీమాంసక

౨౨. స్వరాజ్యము యొక్క రహస్యమును నేను "సత్యార్థప్రకాశము" అను గ్రంథము నుండి గ్రహించితిని. ప్రాచీనమయిన మన జాతి సత్యార్థప్రకాశము యొక్క బోధల

ననుసరించి నడచుకొన్న ఈ ప్రపంచమందలి యేశక్తియు మన స్వాతంత్ర్యమును అరికట్టజాలదు. —సీ. ఎస్. రంగా అయ్యర్

౨౩. బ్రహ్మ (వేదము)ను మరియు పరమేశ్వరుని తెలిసికొన్నవాడే బ్రాహ్మణుడు.

౨౪. మోక్షము కొరకు సమస్త ధర్మయుక్త కర్మల నొనర్చుట నిష్కామ కర్మ యగును. ప్రాపంచిక భోగములగోరి ధర్మయుక్త కర్మల నొనర్చుట సకామకర్మ యగును.

౨౫. వీర్యరక్షణ వలన ఆనందము మరియు నాశము వలన దుఃఖము ప్రాప్తించును.

౨౬. విద్యాధర్మముల వృద్ధి, సమస్త విశ్వమున కుప కారము చేయుటయే ధ్యేయముగ భావించు స్త్రీ పురుషులు వివాహము చేసికొన గూడదు.

౨౭. సౌభరిమునివలె భోగముల ననుభవించుటవలన రాగము శాంతింపదు. —కపిలుడు : ౪/౨౭

౨౮. భోగము లున్నచోట రోగములు, రోగములున్న చోట వృద్ధాప్యము తప్పక యుండును.

౨౯. వ్యభిచారము, అతివిషయాసక్తి వంటి బలబుద్ధి నాశక వ్యవహారములు మరేవియును లేవు.

౩౦. సృష్టి యొక్క యథార్థ స్వరూపమును గ్రహింప నంతవరకు మానవునికి యథార్థ జ్ఞానము కలుగనేరదు.

౩౧. ధర్మము మన ఆత్మ మరియు కర్తవ్యము నంటి యుండును.

౩౨. ప్రతిజ్ఞాభంగ మొనర్చువానికి కలుగునంత హాని మరెవరికిని కలుగదు.

౩౩. ఇతరులకు ఉపకారకములైన వానిని వారు చెడుగా భావించినను తప్పక చెప్పవలెను.

౩౪. మనుష్యుడు తన దోషములను ఇతరులకు తెలుపనంతవరకు దోషములను వదలి గుణవంతుడు కాజాలడు.

౩౫. ప్రశస్త ధార్మిక గుణములు గల తల్లి, తండ్రి, ఆచార్యులు గలిగిన వారు జ్ఞానవంతులగుదురు.

—శతపథ బ్రాహ్మణము.

౩౬. సంతానమును చదివింపని తల్లి శత్రువు, తండ్రి వైరి.

—చాణక్యనీతి.

౩౭. సమస్త ప్రపంచమే బుద్ధిమంతులకు ఆచార్యుడు (గురువు).

—చరక సంహిత

౩౮. ఫలితజ్యోతిషము సత్యము కాదు. మానవుని పతనమున కిదియొక ముఖ్య కారణము. బ్ర. వేదవ్రతమీమాంసక

౩౯. పురుషార్థ పరున కేదియును దుర్లభము కాదు.

౪౦. మానవులు ఏకమతస్థులై పరస్పరము హానిలాభములను సుఖదుఃఖములను ఒకటిగా భావింపనంతవరకు ఉన్నతి జెందుట మిక్కిలి కష్టము.

౪౧. కలియుగము కాలమునకు పేరు. కాలము చలనము లేనిది కావున ధర్మాధర్మముల యందు సాధక బాధకము కాజాలదు.

౪౨. ప్రాచీన గురుకులల పద్ధతివలననే మానవ సమాజము సుఖసమృద్ధిని, శాంతిని పొందగల్గును. ఆధునిక విద్యా విధానము వలన మానవుడు అశాంతి సాగరమున మునకలు వేయును.

—బ్ర. వేదవ్రతమీమాంసక.

ఓ౩మ్

ఫలిత జ్యోతిషము అసత్యమైనది.
దీనిని సత్యమని నమ్మువారిని
శాస్త్రార్థమునకై ఆహ్వానించుచున్నాను.

జ్యోతిష పరిశోధకుడు
ఆచార్య వేదవ్రత మీమాంసక్
ఆర్షగురుకులము
పడ్లూరు, కామారెడ్డి.

ఓ౩మ్

విజయలక్ష్మి బ్రాస్ మర్చంట్
గంజ్ మార్గము, ఇందూరు (నిజామాబాద్.)

మా వద్ద రకరకాల ఇత్తడి, రాగి, స్టీల్ పాత్రలు, యజ్ఞ పాత్రలు, కుండములు, సామగ్రి సరసమైన ధరలకు లభించును. మీ యవసరములను తీర్చుకొనుటలో మా సేవలను తప్పక పొంద గోరుచున్నాము.

- ధనాలకోటి వెంకటనర్సయ్యార్య

ముద్రణ : యస్. వి. బి. వర్క్సు, సికింద్రాబాదు. ఫోన్ : 76939